క్లుప్తంగా

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



అనాథ బాలలకు విద్యా సామాగ్రి అందిస్తున్న కాళిదాస్ సేవా సమితి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఉన్నత స్థానంలో నిలుపుతుందని, ఆర్థిక సమస్యలతో ప్రతి కుటుంబంలో చిన్నారులు విద్యకు దూరం కాకూడదనే భావనతో కాళిదాసు సేవా సమితి పని చేస్తోందని సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు తీగల సత్యవతి పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ కాలనీలోని అనాథ బాలల వసతి గృహ నిర్వాసిత పిల్లలు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. నిర్వాహకుల కోరిక మీదట విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులను ప్రవాస భారతీయులు అప్పన్న శ్రీనివాస్, నళిని దంపతుల సహకారంతో మంగళవారం స్ట్రీట్ చిల్డ్రన్ హోంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో గుర్రం సత్యనారాయణ, చీమకుర్తి శివప్రసాద్, సుభాదేవి, శ్రీనివాసరెడ్డి, ధనిశెట్టి రామునాయుడు, హోం నిర్వాహకులు బిందు తదితరులు పాల్గొన్నారు.

12న శాకంబరి అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అమ్మవారిశాల ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఈ నెల 12వ తేదీన శాకంబరి అమ్మవారిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గర్ర సత్యనారాయణ, తుమ్మలపెంట సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని వారు కోరారు.

బైకు ఢీకొని గేదె మృతి

కంభం: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని గేదె మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి ఫ్లయి ఓవర్ సమీపంలో హైవే రోడ్డుపై జరిగింది. వివరాలు.. మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన దూదేకుల మునెయ్య అనే వ్యక్తి జంగంగుంట్ల నుంచి ద్విచక్ర వాహనంపై కంభం వస్తుండగా ఫ్లయిఓవోర్ సమీపంలో గేదెను ఢీకొట్టాడు. ప్రమాదంలో సంఘటన స్థలంలోనే గేదె మృతిచెందగా ద్వచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటరులో నివాసముండే ఆకుల వెంకటేశ్వర్లు(బాకు) మంగళవారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సుమారు 63 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: ప్రతి వాహనదారుడు, టూవీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. మంగళవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ వినియోగం వల్ల ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపైనా అవగాహన కల్పించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలో ఉన్న ఆరు మండలాలు(పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి) మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు 9959225700కు ఫోన్ చేసి పొదిలి డిపో ఆర్టీసీ సర్వీసుల సమయాలు, ట్రిప్పుల గురించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని కోరారు.



పామూరు: చావిడిలో ముస్తాబైన పీర్లు



పామూరు: చావిడిలో గ్రామోత్సవానికి సిద్ధమవుతున్న పీర్ల గుమ్మటం

మొహర్రం పండుగకు ముస్తాబైన పీర్లు

పామూరు: హిందూ, ముస్లింలు ప్రతిష్టాత్మకంగా మత సామరస్యంగా నిర్వహించుకునే పీర్ల పండుగ మొహర్రం వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకలు ఈనెల 18వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు ముజావర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ముజావర్‌లు పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డులోని పీర్లచావిడి, దర్గాలను, మండలంలోని గోపాలపురంలో ఉన్న దర్గాలను ప్రత్యేక విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ సెంటర్‌లోని పీర్ల గుమ్మటంను గ్రామోత్సవం చేసేందుకు విశిష్ట అలంకరణతో సిద్ధం చేస్తున్నారు. మొహర్రం పండుగా వేడుకల్లో భాగంగా 15వ తేదీన చినసరిగత్తు, గ్రామోత్సవం, 16న సందు, 17న పెద సరిగత్తు, 18న పీర్లు గుండప్రవేశం అనంతరం మధ్యాహ్నం పీర్ల జలప్రవేశంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని ముజావర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు.

కనిగిరి రూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించుకునే మొహర్రం(పీర్ల పండుగ) వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం చాంద్‌రాత్ (మొదటి రోజు) నుంచి నియోజకవర్గంలోని పలు పీర్ల చావిడ్లలో (అషూరా ఖానాల్లో) వివిధ నామకరణాలు కల్గిన (హజరత్) పీర్లను కొలువుతీర్చారు. పట్టణంలోని మయాన మకాన్(ఒంగోలు బస్టాండ్, పాతూరు) వద్ద ఉన్న పీర్ల చావిడిలో ఆదివారం రాత్రి చాంద్ రాత్ సవారి అత్యంత వైభవంగా నిర్వహించారు. బారాయిమామ్ పీరును అత్యంత నియమనిష్టలతో, తప్పెట్ల తాళాలతో, పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కుల, మత, వర్గాలకతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మొహర్రం సందర్భంగా పట్టణంలోని ఐదు పీర్ల చావిడ్లతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడ్లను (అషూరా ఖానా)లను ముస్తాబు చేశారు. ఇప్పటికే మయాన మకాన్, శంఖవరం తదితర గ్రామాల్లోని చావిడ్లలో పీర్లు కొలువుతీరి పూజలు అందుకుంటున్నాయి. ఈనెల 14న (ఆదివారం) చిన శరిగత్తు, 16న(మంగళవారం) పెద శరిగత్తు, 17న బుధవారం షహదత్(పీర్లు బావికి వెళ్లేరోజు), 19న పీర్ల జియారత్ కార్యక్రమం జరుగుతాయని ముజావర్లు వెల్లడించారు.



మార్కాపురం టౌన్: ఉత్సవాలకు సిద్ధం చేసిన పీర్లు



కనిగిరి రూరల్: శంఖవరం చావిడిలో కొలువు తీరిన పీర్లు

మకానాల్లో కొలువుదీరిన పీర్లు

మార్కాపురం టౌన్: మొహర్రం పండగను పురష్కరించుకని మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధిలోని మకానాల్లో మంగళవారం పీర్లు కొలువుదీరాయి. పది రోజులపాటు మత సామరస్యానికి చిహ్నంగా పీర్ల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పట్టణంలోని గొర్లగడ్డ పీర్లచావిడిలో పీర్లను సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. మకానాలో బాదుల్లా సాహెబ్, బారా ఇమామ్, రంగు హుస్సేనీ, గొట్టిపడియ ఖాశీంసాహెబ్, ఇమామ్, హుస్సేనీ పీర్లు ఉన్నాయి. తూర్పువీధులో చిన్నబాదుల్లా, సాహెబ్ పీరు ప్రసిద్ధి చెందింది. అలాగే నాగులవరం రోడ్డు ఆర్టీసీ బస్టాండు, విజయటాకీస్, పూలసుబ్బయ్య కాలనీలోని పీర్లు కూడా మకానాల్లో కొలువుదీరాయి. శనివారం మధ్యాహ్నం ఖాశీం పీర్లకు పగలు ఉత్సవం, మంగళవారం రాత్రి బాదుల్లా సాహెబ్‌కు చిన్న షరగత్, బుధవారం పెద్ద షరగత్, గురువారం సహదత్ పీర్ల జల్ది కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇంగ్లాండ్‌లో ఘంటసాల పాటల జడి



సినీ గీతాలు ఆలపిస్తున్న నాగేశ్వరమ్మ బృందం



నాగేశ్వరమ్మ దంపతులను సన్మానిస్తున్న ప్రవాస భారతీయులు

ఒంగోలు మెట్రో: ఇంగ్లాండ్‌లోని కెంట్ స్టేట్ హాడ్లో ప్రాంతంలో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమంలో ఆల్ ఇండియా కళారంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఘంటసాల స్వరం నుంచి జాలువారిన భక్తి, సినీ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులు సౌజన్య, జ్యోతి, రాజా చక్రిలు పాల్గొని చక్కని పాటలు పాడారు. కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రవాస భారతీయులు వీనుల విందైన తెలుగు గీతాల ఒరవడిలో తేలియాడారు. ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా చల్ల మాలకొండయ్య డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ దంపతులకు ఘనంగా సత్కరించారు.

నిర్వాహకులు చల్లా పవన్ కుమార్, దీపిక మిత్ర బృందానికి, యాంకరింగ్ చేసిన వంశీ, కృష్ణకు నాగేశ్వరమ్మ ధన్యవాదాలు తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తాళ్లూరు ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారి రాజేష్ యాదవ్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మంగళవారం మలేరియా, డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకొని అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. అనంతరం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ, డీపీఎంఓ సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది కోటేశ్వరి, నాగలక్ష్మి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు వైభవంగా సాగుతున్నాయి. 18వ రోజు మంగళవారం ఉభయదాతలను ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు లక్కీడ్రా తీసి గెలుపొందిన వారికి చీర బహూకరించారు. చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనానికి జ్ఞానం అవసరం

కొనకనమిట్ల: ప్రస్తుత సమాజంలో మనిషి ప్రశాంతంగా జీవించాలంటే జ్ఞానం ఎంతో అవసరమని ప్రబోధ సేవా సమితి దొనకొండ కమిటీ అధ్యక్షుడు టి.ఏడుకొండలు పేర్కొన్నారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వద్దిమడుగు, అంబాపురం, రేగడపల్లి, వాగుమడుగు గ్రామాలలో ఇంటింటికి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తూ దైవ సందేశాలపై కర పత్రాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు చెన్నకేశవులు, ఎస్.వీరాంజనేయులు, కాశీలక్ష్మి, ఆదిలక్ష్మి, సుబ్బులు, సరస్వతి, సుబ్బమ్మ, భాగ్యలక్ష్మి, సీతమ్మ, హర్షిత, సుమలత, లక్ష్మి పాల్గొన్నారు.

జగద్గురువు శ్రీకృష్ణభగవానుడే



భగవద్గీత ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: జగద్గురువు శ్రీకృష్ణభగవానుడే అని త్రైత సిద్ధాంతం కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వెంగళరెడ్డిపల్లె, జయరాంపురం, జయరాంపురంతాండా గ్రామాల్లో మంగళవారం భగవద్గీత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 21వ తేదీన వచ్చే ఆషాడ మాసం గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి గ్రామంలో భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. భగవద్గీత యావత్తు మానవాళి ధర్మ మార్గం వైపు అడుగులు వేయిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవడం ఎంతో జ్ఞానాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. నిర్వాహకులు చేగిరెడ్డి రామకృష్ణారెడ్డి, బలరాం, జి.తిరుపతయ్య, టి.తిరుపతయ్య, కృష్ణవేణి, కె.లక్ష్మి, సరస్వతి, నారాయణ, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ

గిద్దలూరు రూరల్: యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కాపీ రైటింగ్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయుడు మొర్రిపిచ్చయ్య యాదవ్ తన సంస్థ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. విద్యార్థులకు విద్యకు ఉపయోగపడే విధంగా అనేక సేవా కార్యక్రమాలు పిచ్చయ్య యాదవ్ అనేక మార్లు చేపట్టారన్నారు.



కాపీ రైటింగ్ పుస్తకాలు అందజేస్తున్న పిచ్చయ్య యాదవ్

సబ్సిడీపై విత్తనాలు



ఏఓ బాలకృష్ణనాయక్

దర్శి: మండలంలోని వ్యవసాయ శాఖలో సబ్సిడీపై విత్తనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీ విత్తనాల వివరాలు ఆయన మంగళవారం తెలియజేశారు. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల సాయంతో సబ్సిడీ విత్తనాలు బుక్ చేసుకోవాలని సూచించారు. కంది ఎల్‌ఆర్‌జీ-52 రకం కేజీ విత్తనం ఖరీదు రూ.139.80కాగా కట్టాల్సిన సబ్సిడీ పోను రూ. 97.87గా నిర్ణయించినట్లు తెలిపారు. వరి విత్తనాలు కేజీకి రూ.41.80 కాగా ఐదు రూపాయలు తగ్గించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఎం కిసాన్ నిధులు వినియోగించుకోవాలి

దొనకొండ: గ్రామాల్లోని రైతులు 18వ విడత ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 558 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని ఏఓ తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని కలిసి బయోమెట్రిక్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ఈ విషయం ఆలస్యం చేస్తే 18వ విడత పీఎం కిసాన్ నిధులు వారి అకౌంట్లలో జమ కావన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహించాలి



సీఆర్‌పీలతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రమేష్‌తో ఎంఈఓ ఆంజనేయులు

మద్దిపాడు: మండలంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకూ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా విద్యాప్రవేశం కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి యం రమేష్ అన్నారు. మంగళవారం మండల రిసోర్స్ కార్యాలయంలో సీఆర్‌పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని తీరును సమీక్షించారు. విద్యాప్రవేశ్, నేను బడికి పోతా, నిష్ఠ, పొగాకు రహిత పాఠశాలలు, ఏక్‌పేడ్‌మాకే నామ్ వంటి కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలు తప్పని సరిగా అమలు చేయాలని ఆయన సీఆర్‌పీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ పరిశీలన



స్టూడెంట్ కిట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు భారతి, ఇద్దరు ఎంఈఓలు

చీమకుర్తి: ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు భారతి పరిశీలించారు. మంగళవారం చీమకుర్తి ఎంఆర్‌సీ కార్యాలయానికి ఆకస్మికంగా వచ్చారు. స్టూడెంట్ కిట్‌లో విద్యార్థులకు ఇస్తున్న నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్ వంటి పలు వస్తువులు సక్రమంగా విద్యార్థులకు అందుతున్నాయా..? లేదా అని తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ-1, 2 డీవీఎల్ నరశింహారావు, కే.శివాజీతో పాటు హైస్కూలు టీచర్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత



నగదు అందిస్తున్న ట్రస్ట్ సెక్రటరీ సర్దార్

ఒంగోలు సెంట్రల్: నగర పరిధిలోని పేర్నమిట్టకు చెందిన అబ్దుల్ గఫూర్ తల్లిదండ్రులు మృతి చెందడంతో నాయనమ్మ మహబూబి వద్ద ఉండి విద్యనభ్యసిస్తున్నాడు. 8వ తరగతి చదువుతున్న గఫూర్‌కు పుస్తకాలు కొనేందుకు, విద్య అభ్యసించటానికి తగిన ఆర్థిక స్తోమత లేకపోవడంతో సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాషాను విద్యార్థి బంధువులు సంప్రదించారు. ఎన్‌ఆర్‌ఐ కుర్రా అనిల్ సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.15 వేల నగదును మంగళవారం అందించారు. మున్ముందు కూడా విద్యార్థి గఫూర్‌కు చేయూత ఇస్తామని తెలిపారు.

శ్మశాన ఆక్రమణను అడ్డుకోండి



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

ఒంగోలు అర్బన్/కొండపి(సింగరాయకొండ): శ్మశాన స్థలం ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కొండపి మండలం కోయవారిపాలెం గ్రామవాసులు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్వే నంబర్లు 368, 384లో భూమిని కొందరు ఆక్రమించి గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ విచారకు ఆదేశించారు. ఈ మేరకు కోయవారిపాలెంలో వివాదాస్పద స్థలాన్ని ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి మంగళవారం పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ హనుమంత్‌రావు, వీఆర్ఓ కోటేశ్వరరావు ఉన్నారు. అలాగే పెట్లూరు లోని సర్వే నెంబర్ 450లో ఉన్న వివాదాస్పద స్థలాన్ని కూడా ఆర్డీఓ పరిశీలించారు.

రైతుకు లాభసాటిగా కొర్రసాగు



కొర్రపైరును పరిశీలస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులకు కొర్రసాగు లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం తూర్పుగంగవరం, లింగాలపాడులో సాగు చేసిన కొర్ర పైరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్రలను అన్ని సీజన్‌ల్లో విత్తుకోవచ్చన్నారు. తేలిక నేలలు, నల్లరేగడి నేలలు, మురుగునీరు పారుదలగా ఉంటే నేలలో సాగు చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ, తక్కువ కాలపరిమితితో నికర దిగుబడులు, నికర లాభాలు పొందవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా ఎకరాకు నికరంగా ఎనిమిది నుండి 12 క్వింటాళ్ల దిగుబడి పొందొచ్చన్నారు. 80 రోజుల్లో పంట చేతి కొస్తున్నందున ఏడాదికి మూడు పంటలు పండించడం సాధ్యపడుతుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కొర్రలకు మంచి గిరాకీ ఉన్నందున రైతులు కొర్రసాగుపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట వీఏఏ నాగరాజు, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



ముండ్లమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ముండ్లమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో కూడిన విద్యను అందించనున్నట్లు హెచ్‌ఎం కె.శారద తెలిపారు. మండల కేంద్రం ముండ్లమూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ విధిగా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థులకు అనేక వసతులు రాయితీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు బడికి పంపాలని కోరారు. చిన్నారల వయసును ఆధారంగా తరగతుల్లో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు కోసం విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు లలితకిరణ్, ఐఈఆర్టీ కోటేశ్వరరావు, సీఆర్పీలు నాగమణి, మరియమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ జాన్, అంగన్‌వాడీ కార్యకర్త మంజులవాణి పాల్గొన్నారు.